# వాహన ప్రమాదాల అవగాహన కోసం 'బోల్తా కారు' ప్రదర్శన

**కుప్తి ఘాట్ రోడ్‌పై ప్రయాణికులకు ప్రమాదం చూపిస్తూ సురక్షా అవగాహన**

**రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన ఎస్పీ అఖిల్ మహాజన్**




**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్ :** నేరడిగొండ మండలం కుప్తి ఘాట్ రోడ్‌లో వాహనాల బోల్తా పడే ప్రమాదాలు తరచుగా జరుగుతున్న నేపథ్యంలో, ప్రయాణికులకు రోడ్డు ప్రమాదాల తీవ్రతను చూపే ప్రత్యేక అవగాహన కార్యక్రమం కేఎన్ఆర్ నేషనల్ హైవే ప్రాజెక్ట్ నిర్వహించింది. ఈ సందర్భంగా, కేఎన్ఆర్ ప్రాజెక్ట్ మేనేజర్ సూర్యనారాయణ, జనరల్ మేనేజర్ రాం మొహన్ రెడ్డి ఒక స్టాండ్‌లో బోల్తా పడిన కారు మోడల్ని ప్రదర్శించారు. ఇది వాహన ప్రమాదంలో ఏ విధంగా కారుకు ప్రమాదం వస్తుందో సుస్పష్టంగా చూపించడానికి ఏర్పాటు చేశారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఈ ప్రదర్శన ద్వారా ప్రయాణికులు వాహనాలు రోడ్డు ప్రమాదాలకు సున్నితంగా ఉండాలి అనే అవగాహన ఏర్పడుతుందన్నారు. రోడ్డుపై వేగం నియంత్రణ, సురక్షిత దూరం పాటించడం, సీట్‌బెల్ట్ ధరిస్తే ప్రమాదాలను తగ్గించవచ్చున్న విషయాలను కూడా వాహనదారులకు అర్థమయ్యేలా చూపించడమే లక్ష్యం అని అన్నారు. ప్రతి డ్రైవర్, ప్రయాణికుడు రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించాలి. ఈ విధమైన అవగాహన కార్యక్రమాలు ప్రమాదాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ సీఐ బండారి రాజు, ఎస్సై ఇమ్రాన్, కేఎన్ఆర్ నేషనల్ హైవే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీసీలను రాజ్యాధికారానికి దూరం చేస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం

**కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి**

**జనగణనలోనే కులగణన చేయాలి**



వాస్తవ నేస్తం,ఇచ్చోడ : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం బీసీ ప్రధానమంత్రి అని చెబుతూ బీసీలను రాజ్యాధికారానికి దూరం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి అన్నారు. బుదవారం బోథ్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 ఏప్రిల్ 30 న కేంద్ర కేబినెట్ జనగణన లోనే కులగణన నిర్వహిస్తామని చెప్పి జనవరి 22న కేవలం జనగణన కోసం నోటిఫికేషన్ విడుదల చేశారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ ఆధ్వర్యంలో కులగణన జరిపి దేశానికే రోల్ మోడల్ గా నిలిచిందని నిలిచిందని, కులాల వారిగా వాటాలు తేల్చి రాజకీయ రిజర్వేషన్లు కూడా కల్పించామని ఆయన తెలిపారు. జనగణలో కేవలం ఎస్సీ, ఎస్టీల జనగణ మాత్రమే చేస్తున్నారని అన్ని కులాలు, ఉప కులాల వారిగా నిర్ధారించి బడ్జెట్ కేటాయింపులు, సంక్షేమ ఫలాలు, ప్రత్యేక రాయితీలు కల్పించే అవకాశం ఉంటుందని మేమెంతో మాకంతా నినాదాన్ని తుంగలో తొక్కి దొడ్డి దారిలో రాజ్యాధి కారానికి దూరం చేస్తుందని ఆయన విమర్శించారు. రాష్ట్రంలోని బీసీ సంఘాలు బిజెపి ఎంపీలపై ఒత్తిడి పెంచి పార్లమెంట్లో చర్చ జరిపించే విధంగా ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అందూర్ గ్రామ సర్పంచ్ పెందూర్ పృథ్వీరాజ్, నక్క లవాడ గ్రామ సర్పంచ్ అడప నవీన్ కుమార్, దన్నూర్ సర్పంచ్ ఎల్మ రోహిణి వినయ్ రెడ్డి, కుచలాపూర్ ఉప సర్పంచ్ సుద్దుల అరుణ్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ మహమ్మద్ అబ్రార్, నాయకులు మెరుగు భోజన్న, పన్నాల చమేందర్ రెడ్డి, కోలా ప్రశాంత్, తరుణ్, అచ్యుతానంద రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా నాయకులు ఉమేష్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు మొదటి ప్రాధాన్యత

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఇచ్చోడలో మహిళా పోలీసు సిబ్బందికి ప్రత్యేకంగా విశ్రాంతి గది**

**రికార్డుల నవీకరణ ఎప్పటికప్పుడు జరగాలని సూచన**



**వాస్తవ నేస్తం,ఇచ్చోడ :** జిల్లాలో మహిళల భద్రత, రక్షణ చర్యలు పటిష్టంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. పోలీసు యంత్రాంగం మహిళల రక్షణకు మొదటి ప్రాధాన్యతను కేటాయిస్తుందని ఆయన పేర్కొన్నారు. బుదవారం ఇచ్చోడ పోలీస్ స్టేషన్ నందు మహిళా పోలీసు సిబ్బంది నిత్యవసర పనుల నిమిత్తం ప్రత్యేకంగా నూతన గదిని ఎస్పీ ప్రారంభిం చారు. అలాగే సిబ్బంది విశ్రాంతికి పురుషులకై ప్రత్యే కంగా మరొక విశ్రాంతి గదిని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళల రక్షణకై షీ టీం 24 గంటలు అందుబాటులో ఉంటూ రక్షణ చర్యలను చేపడుతున్నదని, మహిళలు, చిన్నారుల భద్రతకై షీ టీం ఆధ్వర్యంలో పోలీసు అక్క ప్రారంభించి చిన్నారులకు మరింత దగ్గర అయిందని వివరించారు. మహిళల పట్ల జరుగు నేరాలపై పాఠ శాలలు, కళాశాలలు, గ్రామాల వారీగా మహిళలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తూ చైతన్యం పరుస్తు న్నామని చెప్పారు. అనంతరం ఇచ్చోడ పోలీస్ స్టేషన్ లో రికార్డులను పరిశీలించారు. రికార్డుల నవీకరణ ఎప్పటికప్పుడు చేయాలని, ఎలాంటి పెండింగ్ కేసులు లేకుండా బాధితుల సమస్యల పట్ల బాధ్యతయు తంగా వ్యవహరించాలని అన్నారు. పెండింగ్ లో ఉన్న కేసుల దర్యాప్తును పూర్తి చేసి కోర్టులలో చార్జిషీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్టానిక సీఐ బండారి రాజు, ఎస్ఐ రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిల్వ ఉంచిన అక్రమ కలప స్వాధీనం ఇద్దరిపై కేసు నమోదు



వాస్తవ నేస్తం,ఇచ్చోడ : ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలప దుంగ లను బుధవారం అటవీ శాఖ అధికారులు పట్టుకు న్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి బాజీరావ్ పాటిల్ ఆదేశాల మేరకు ఇచ్చోడ అటవీ శాఖ పరిధిలోని గుడి హత్నూర్, తలమడుగు మండలాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన ప్రాంతాల్లో ఇచ్చోడ అటవీ అధికారులు దాడులు నిర్వహించారు. గుడిహత్నూర్ మండలం ముత్నూరు కు చెందిన జీ. దశరథ్, తలమడుగు మండలం కు చెందిన కటకం లక్ష్మణ్ వద్ద నిల్వ ఉన్న 53/ 0.636 సెంటి మీటర్ల కలప దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసినట్లు స్తానిక ఎఫ్ డీ వో ప్రవీణ్ మహాజన్ తెలిపారు. స్వాధీ నం చేసుకున్న కలప విలువ రూ. 53 వేల 500 ఉంటుందని ఆయన తెలిపారు. అటవీ శాఖ అను మతి లేకుండా ఎవరైనా అక్రమంగా కలప నిల్వ ఉంచిన, అక్రమంగా చెట్లను నరికిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఆయన హెచ్చరిం చారు. ఈ దాడుల్లో స్తానిక అటవీ అధికారి పుండలిక్, సెక్షన్ అధికారి జాదవ్ నౌసిలాల్ సిబ్బంది పాల్గొ న్నారు.

## బజార్ హత్నూర్ మండల కాంగ్రెస్ కన్వీనర్‌గా జల్కె పాండురంగ్



**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** బజార్ హత్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్‌గా జల్కె పాండురంగ్‌ను రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికచేశారు. సోమవారం మండల కేంద్రంలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకోబడింది. సమావేశానికి మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జల్కె పాండురంగ్ పేరును ప్రతిపాదించిన వెంటనే హాజరైన సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. పార్టీ నేతల ప్రకారం, గత కాలంలో మండల స్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన పాత్ర ప్రాముఖ్యత ఉంది, అందుకే మరోసారి ఈ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా, మండల కన్వీనర్‌గా ఎన్నికైన జల్కె పాండురంగ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచిన పార్టీ అధిష్ఠానం, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిరంతరం పని చేస్తానని స్పష్టం చేశారు. అంతేకాక, కార్యకర్తలందరినీ కలుపుకొని మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో పాల్గొన్న మండల కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, జల్కె పాండురంగ్ నాయకత్వంలో పార్టీకి మండలంలో మంచి ప్రజాదరణ లభించిందని, రాబోయే రోజుల్లో ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ నాయకులు, సీనియర్ కార్యకర్తలు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద 28 లక్షల నగదు స్వాధీనం

**రాంపూర్ ఎస్ఎస్‌టి తనిఖీల్లో పట్టుబడ్డ నగదు**



**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్ :** జిల్లా పట్టణ శివారులోని రాంపూర్ ప్రాంతంలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టి (సర్వైలెన్స్ స్క్వాడ్ టీమ్) చెక్‌పోస్ట్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో భారీ మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా తరలిస్తున్న 28 లక్షల నగదును అధికారులు పట్టుకున్నారు. వివరాల ప్రకారం, మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్ వైపు ప్రయాణిస్తున్న ఒక బస్సును రాంపూర్ చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఎస్‌టి బృందం తనిఖీ చేసింది. ఈ తనిఖీల్లో మహారాష్ట్ర రాష్ట్రం ఉమర్కేడ్ తాలూకా ధానీ గ్రామానికి చెందిన సుభాష్ కేశవ్ జన్వార్ అనే వ్యక్తి వద్ద పెద్ద మొత్తంలో నగదు ఉన్నట్లు గుర్తించారు. నగదు తరలింపుకు సంబంధించిన ఎలాంటి సరైన ధ్రువపత్రాలు చూపించకపోవడంతో, ఎన్నికల నియమావళి ప్రకారం అధికారులు మొత్తం నగదును స్వాధీనం చేసుకున్నారు. మున్సిపల్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో అక్రమంగా నగదు రవాణాను అడ్డుకునేందుకు ఎస్ఎస్‌టి బృందాలు 24 గంటల పాటు అప్రమత్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. చెక్‌పోస్ట్‌ల వద్ద వాహనాలు, బస్సులు, ప్రయాణికులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ నగదు, ఇతర అనుమానాస్పద వస్తువులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ తహసిల్దార్ భూష మహేష్, పోలీసు సిబ్బంది మరియు ఎస్ఎస్‌టి బృంద సభ్యులు పాల్గొన్నారు. స్వాధీనం చేసుకున్న నగదును తదుపరి విచారణ నిమిత్తం సంబంధిత అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. నగదు ఎవరి కోసం, ఏ ప్రయోజనంతో తరలిస్తున్నారన్న అంశాలపై విచారణ కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియను స్వచ్ఛంగా నిర్వహించేందుకు ఇలాంటి తనిఖీలు మరింత కఠినంగా కొనసాగుతాయని జిల్లా ఎన్నికల అధికారులు హెచ్చరించారు.

## ఎంఐఎం పార్టీ ఎమ్మెల్యే ఖానాపూర్ లో ప్రచారం.

**ఖానాపూర్ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది.**

**మా పార్టీ కార్యకర్తలను బెదిరింపులకు గురి చేస్తే మేము అనుకున్నది చేస్తాం.**

**నాంపల్లి ఎమ్మెల్యే మజిద్ హుస్సేన్.**

**నిర్మల్ :** ఖానాపూర్ పట్టణంలోని మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా, ఎంఐఎం పార్టీ నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్, పట్టణంలోని ఎనిమిదవ వార్డు, 12వ వార్డు సభ్యులను పతంగి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, ఎంఐఎం పార్టీ కార్యకర్తలను, ఏ పార్టీ వారైనా బెదిరింపులకు గురి చేసినట్లయితే గెలుపొందిన తర్వాత కిడ్నాప్లకు గురిచేసిన మేము ఎలాంటి చర్యలకు పూనుకుంటామనేది తర్వాత తెలుస్తుందని హెచ్చరించారు. తెలంగాణ బడ్జెట్ విషయానికి వస్తే వచ్చిన బడ్జెట్ను సద్వినియోగ పరచాలన్నారు. ఖానాపూర్ అభివృద్ధికి ఆమే డ దూరంలో ఉందని కాలనీలలో దుమ్ము ధూళితో మురికి కాలువలు దుర్గంధ భరితంగా వాసన వెదజల్లుతున్నాయి అన్నారు. మా అభ్యర్థులను గెలిపించినట్లయితే మునిసిపల్ అభివృద్ధికి తోడ్పడుతామని తెలియజేశారు.

## అతివేగం కారణంగా అశోక్ లేలాండ్ వాహనం బోల్తా

**ములుగు :** చర్ల నుండి మేడారం వెళ్తున్న అశోక్ లేలాండ్ వాహనం తాడ్వాయి మండలం పరిధిలో అతివేగం కారణంగా బోల్తా పడి ప్రమాదానికి గురైంది. కామరాం గ్రామాన్ని దాటి గిన్నెలవాగు బ్రిడ్జి సమీపంలోని మలుపు వద్ద వాహనం అతి వేగంగా వెళ్లడం వల్ల డ్రైవర్ నియంత్రణ కోల్పోయి వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనంలో ప్రయాణిస్తున్న సుమారు 30 మంది ప్రయాణికుల్లో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే తాడ్వాయి ఎస్.ఐ. జగదీశ్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని అంబులెన్స్ లో సమీప దవాఖానకు తరలించి తక్షణ చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు. ప్రయాణికులు మూల మలుపులు, వాగు బ్రిడ్జిల వద్ద వాహనాలను అతి వేగంగా నడపకుండా జాగ్రత్తలు పాటించాలని మూల మలుపుల వద్ద ఉన్న సూచికలను పాటిస్తూ వాహనాలు నడుపాలని ఎస్ ఐ తెలియచేసారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com